క్లుప్తంగా

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మణికొండ: గండిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ వైర్లకు సమీపంలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని నార్సింగి ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు. గండిపేట గ్రామంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, శాంతినగర్, సబితానగర్, స్కైజోన్, నియోపోలీస్, యాదవ సంఘం ఏరియాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే అభినందనలు



చందును అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆల్‌రౌండ్ ప్రతిభ కనబర్చి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన చందును ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం మ్యాచ్‌లు జరగ్గా ఆదివారం బహుమతుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. చందు మొదటి మ్యాచ్‌లో 58 పరుగులు నాటౌట్, ఫైనల్ మ్యాచ్‌లో 75 పరుగులు నాటౌట్‌గా నిలిచారు. బౌలింగ్‌లోను నాలుగు వికెట్లను తీయటంతో ఆయనకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కింది.

వాసవీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా యాదగిరి



నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వాసవీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా యాదగిరి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా బ్రహ్మానందం ఎన్నికయ్యారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు ఆంజనేయులు వారితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సంఘం తరపున చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రామలింగం గుప్తతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తలారి మల్లేశ్ ముదిరాజ్

మణికొండ: శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ డాక్టర్ బండ ప్రకాశ్‌ముదిరాజ్‌ను జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, గండిపేట మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన శాసనమండలిలో పదవీ ప్రమాణ స్వీకారం చేయటంతో ఆయనను కలిసి మండలి ఆవరణలోనే అభినందనలు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో శాసనమండలి హుందాగా కొనసాగాలని, ముదిరాజ్‌లకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

శంషాబాద్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గోషామహల్ కిషన్‌గంజ్ ప్రాంతానికి చెందిన వీకాస్ బండారి అతని కుమారుడు నీల్‌బండారి (17) స్కూటీపై శంషాబాద్‌లోని కోలీష్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9 రాత్రి విందుకు హాజరయ్యారు. రాత్రి ఇంటికి వెళుతుండగా కోలీష్ ఫంక్షన్‌హాల్ ఎదుట బైక్ అదుపుతప్పి నీల్‌బండారి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డాక్ ప్రాస్ట్ ఐస్‌క్రీం స్టోర్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని దుర్గంచెరువు మెట్రో రైల్‌స్టేషన్ వద్ద ఆదివారం డాక్ ప్రాస్ట్ పేరిట ఐస్‌క్రీం స్టోర్‌ను సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మంచి ప్రోటీన్‌లు కలిగిన ఐస్‌క్రీంలను అందించాలని కోరారు. కార్యక్రమంలో మూల సుభాష్ గౌడ్, శశాంక్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్

- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- అనుమతులు లేకుండానే పరిశ్రమల నిర్వహణ
- నేతలు, అధికారులకు కాసులు కురిపిస్తున్న కంపెనీలు



ప్రేమావతి పేట చెరువు వద్ద నూనె వ్యర్థాల నుంచి రసాయనాలు తయారు చేస్తున్న దృశ్యం

శంషాబాద్: ఇక్కడ నిబంధనలు ఏమాత్రం పాటించరు. అంతకుమించి కనీసం సంబంధిత శాఖల నుంచి అనుమతులు సైతం తీసుకోరు. ఇష్టారాజ్యంగా కొనసాగుతోన్న పరిశ్రమలు కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు పెత్తనం చెలాయిస్తున్న కొందరు నేతలు, ప్రజాప్రతినిధులకు కాసులు కురిపిస్తున్నాయి. ఫలితంగా పర్యావరణ హాని పాటు ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి..

లెక్కకు మించి పరిశ్రమలు

గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోన్న పరిశ్రమల్లో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా అనేక మంది కార్మికులు గాయాలపాలయ్యారు. నూనె పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఫ్లై వుడ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గత పదేళ్లలో సుమారు యాభైకి పైగా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతి చెందిన కార్మికులతో పాటు అనేక మంది గాయాలపాలయ్యారు. ఇందులో అత్యధికం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పరిశ్రమల్లో జరిగినవే కావడం గమనార్హం.

ప్లాస్టిక్, రసాయ వ్యర్థాలు..

గగన్‌పహాడ్‌లో ప్లాస్టిక్‌కు సంబంధించిన వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే పరిశ్రమలతో పాటు రసాయన వ్యర్థాలు శుద్ధితో పాటు జంతు వ్యర్థాలతో తయారు చేసే నూనెలు, నూనెల వ్యర్థాలతో తయారు చేసే రసాయనాలకు సంబంధించిన పరిశ్రమలు అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. ప్రేమావతి పేట చెరువు సమీపంలో ఓ వ్యక్తి భారీగా నూనె వ్యర్థాలతో రసాయనాలను తయారుచేసి లారీల్లో సరఫరా చేయడంతో పాటు వ్యర్థాలన్నింటినీ చెరువులోనే కలిపివేస్తున్నాడు. దీనిపై అనేక ఫిర్యాదులొచ్చినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నిబంధలనకు విరుద్ధంగా జంతు సంబంధిత నూనె తయారీ పరిశ్రమ కొనసాగుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సంబంధిత పరిశ్రమల నుంచి ఆయా శాఖలకు చెందిన కొందరు అధికారులతో పాటు కొందరు పోలీసులు, స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులకు కూడా భారీగానే ముడుపులు అందుతుండడంతో చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగే సమయంలో హడావిడి చేస్తున్న ఆయా శాఖల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పరిశ్రమలపై కఠినవైఖరిని అవలంభించి పర్యావరణంతో పాటు ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



పేలుడు జరిగిన ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ

ప్రతి రోజు పేలుళ్లు



ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలో ప్రతిరోజు బాటిళ్లు పేలి వాటి ముక్కలు బయటపడుతుంటాయి. పలుమార్లు వాహనాలపై పడ్డ సంఘటనలున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.
–ఎండీ రెహ్మాన్– గగన్‌పహాడ్

ఘనంగా మల్లన్న బోనాలు



అగ్నిగుండం తొక్కుతున్న పోతరాజులు, ఒగ్గు కళాకారులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ఆదివారం మల్లన్న కల్యాణం, బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గంపలతో గ్రామస్తులు దేవాలయానికి చేరుకుని అక్కడే బోనాలను సిద్ధం చేసుకున్నారు. ఒగ్గు కళాకారుల మంత్రాలతో మల్లన్న స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం, అగ్నిగుండాలు తొక్కటం, గొలుసులు తెంపటం కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఊరేగింపుగా దేవాలయం చుట్టు ప్రదక్షిణలు చేసి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కౌన్సిలర్ బి. యాదమ్మ, మాజీ సర్పంచ్ స్వరూప నగేష్‌యాదవ్ ఏర్పాట్లు చేశారు.



దేవాలయానికి బయలుదేరుతున్న గ్రామస్తులు

శాంతిసరోవర్‌లో మహా శివరాత్రి వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి శాంతిసరోవర్ ప్రాంగణంలో మహాశివ రాత్రి వేడుకలను ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది 16 ఫీట్ల గోల్డ్ కలర్ శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శనం.. స్పిరిచ్యువల్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, లెటర్ టు గాడ్ కార్యక్రమం, చర్చలు, మెడిటేషన్, వాల్యూ గేమ్స్, హెల్త్ స్టాల్ నిర్వహిస్తున్నారు.

బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

రాజేంద్రనగర్: ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లోని బంగారం, నగదును దొంగలు దోచుకెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బండ్లగూడ పంచాయతీ పాత కార్యాలయం వెనక బస్తీలోని ఓ భవనంలో వికాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శనివారం అతను కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. దీంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపరిచిన పది తులాల బంగారు ఆభరణాలు, రూ. 50వేల నగదు కనిపించలేదు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ని పనులున్నా ప్రజా సేవలోనే: ఎమ్మెల్యే కౌసర్



సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ఎన్ని పనులున్నా ప్రజా సేవలోనే ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయానికి వచ్చిన వారిని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ తమ దరఖాస్తులను ఆయనకు చూపించారు. దీనిపై ఎమ్మెల్యే దరఖాస్తులను చదివి సరైన వాటిపై సంతకాలు చేశారు. దరఖాస్తు చేసుకున్న వారు వారి పురోగతిపై ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. అసెంబ్లీ సాక్షిగా కార్వాన్ నియోజకవర్గ సమస్యలపై ఆయా శాఖల మంత్రులను నిలదీస్తున్నానని ఆయన అన్నారు. కార్వాన్ డివిజన్‌లోనే కాకుండా నిరుపేదలు, పేద బడుగువర్గాల వారు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తాను అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. కార్వాన్‌లో డ్రైనేజీ పనులు, వరదనీటి పైప్‌లైన్ల పనులు జోరుగా సాగుతున్నాయని, ఆ పనులు పూర్తికాగానే రోడ్డు పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కార్వాన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ, తెలుగు మాధ్యమాలు ప్రారంభమయ్యేలా కృషి చేస్తున్నానన్నారు.

గోవుల సంరక్షణకు ప్రత్యేక కృషి

అబిడ్స్: గోవుల సంరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని గో రక్షాదళ్ తెలంగాణ లీగల్ సెల్ అధ్యక్షుడు న్యాయవాది శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ.. గోవుల సంరక్షణకు, గో ఉత్పత్తికి నిరంతరం పాటుపడుతానన్నారు. గోవులను రక్షించేందుకు గో రక్షాదళ్ తెలంగాణ పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ తెలంగాణ గో రక్షాదళ్ సభ్యులు కోశి శ్రీధర్, వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ శివప్రసాద్, ఇతర నాయకులు రఘురామ్ శర్మ, అభయనాథ్ స్వామి, గిరిప్రసాద్, ఓంసింగ్ రాజ్ పురోహిత్, శ్రీరామ్‌జోషి, పవన్‌రెడ్డి, న్యాయవాది శ్రీదేవి, వినోద్‌కుమార్, ప్రసన్న, జస్వంత్ పాల్గొన్నారు.

గోల్ఫ్ లీగ్ ఫైనల్లో టీమ్ మైసా, స్వాన్స్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్ తుది అంకానికి చేరింది. 16 జట్లతో ఉత్సాహంగా సాగుతున్న ఈ లీగ్‌లో టీమ్ మైసా, టీమ్ స్వాన్స్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఆదివారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఈ రెండు జట్లూ తమ ప్రత్యర్థులపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఊటీ గోల్ఫ్ కౌంటీ వేదికగా జరిగిన తొలి సెమీస్‌లో టీమ్ మైసా 50–30 స్కోర్‌తో మీనాక్షి మావెరిక్స్‌పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో టీమ్ స్వాన్స్ 45–35 స్కోర్‌తో టీమ్ ఆల్ఫాపై గెలుపొందింది. థాయ్‌లాండ్‌లో ఫిబ్రవరి 24న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. లీగ్ ఆరంభం నుంచీ ప్రతీ మ్యాచ్ ఆసక్తికరంగా సాగడంపై హెచ్‌పీజీఎల్ కమిషనర్ డీఎస్ సుమంత్ ఆనందం వ్యక్తం చేశారు.

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానం

జియాగూడ: 18న కాగజ్‌గూడ శంకర్‌జీ, హనుమాన్‌జీ ఆలయంలో జరిగే శ్రీ శివ మహాజాగరణ ఉత్సవానికి హాజరుకావాలని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఆహ్వానించినట్లు మహా జాగరణ్ సేవా సమితి ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, కన్వీనర్ రాజ్‌కుమార్, కో కన్వీనర్‌లు సచిన్ రాజ్‌సింగ్, జనగం పాండు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కార్యాలయానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నగరంలోనే మహా శివ జాగరణ్ ఈ ఆలయంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు.

కాలనీ వాసుల సంక్షేమానికి కృషి చేయాలి



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న ఆంజనేయులు

మణికొండ: కాలనీల సంక్షేమ సంఘాలకు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారు నిజాయితీగా వారి సంక్షేమానికి కృషి చేసి, కాలనీలను నందన వనాలుగా తీర్చి దిద్దేందుకు చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపాలిటీ ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి. ఆంజనేయులు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల సమావేశం, నూతన కమిటీ ఎన్నికలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ కృషి చేస్తుందన్నారు. కాలనీల సమస్యలపై తమను సంప్రదిస్తే కలిసి పోరాటం చేద్దామన్నారు.

కేపీఆర్ కాలనీ అధ్యక్షుడిగా రమణారెడ్డి..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని కేపీఆర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా జి.రమణారెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వై. కృష్ణ భాస్కర్, పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.సింహా రాజారెడ్డి, కోశాధికారిగా గిరిధర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు సంయుక్త కార్యదర్శులుగా వై. వాసు మహేశ్వర్, పి.శ్రీనివాస్, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా శారదమ్మ, ఎ.రాజశేఖర్, శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, పి.వేణు, న్యాయ సలహాదారునిగా ఎస్‌వీ రత్నం, ప్రచార సలహాదారునిగా కె.గణేష్‌రెడ్డి, సలహాదారులుగా కె.రాజిరెడ్డి, జె. సిద్దప్ప, డి. కృష్ణమూర్తిలను ఎన్నుకున్నారు.

ముగిసిన సరస్వతీ విద్యాపీఠం స్వర్ణోత్సవాలు



సరస్వతీ విద్యాపీఠంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

బండ్లగూడ: శ్రీ సరస్వతీ విద్యాపీఠం స్వర్ణోత్సవాల్లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధానాచార్యులకు బండ్లగూడలోని శారదా ధామంలో మూడు రోజులపాటు నిర్వహించిన సంకల్ప శిబిరం ఆదివారం ముగిసింది. రెండు రాష్ట్రాల నుంచి 400 మంది ప్రధానాచార్యులు, 200 మంది పదాధికారులు పాల్గొన్నారు. ముగింపు సమారోహ కార్యక్రమంలో క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి పాల్గొని పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో అగ్రవాల్ సమాజ్ చైర్మన్ రమేష్‌కుమార్ అగ్రవాల్, సేవా భారతి ఉపాధ్యక్షుడు హేమంత్, క్షేత్ర అధ్యక్షుడు చామర్తి ఉమామహేశ్వరరావు, దాత సీవీఆర్ ప్రసాద్, గోవింద్ చంద్ర మహంత్, సత్యనారాయణ, సీ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకం



మట్టి తరలించడంతో ఏర్పడిన గుంతలు

శంషాబాద్ రూరల్: ఆలయ భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. భారీ యంత్రాలతో మట్టిని తవ్వడంతో భూమిలో గుంతలు ఏర్పడుతున్నాయి.. మండలంలోని పాల్మాకుల రెవెన్యూలోని సర్వే నంబరు 568లో 1.14 ఎకరాల భూమి.. చేవెళ్లలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయం పేరుతో ఉంది. ఈ ఆలయానికి దాతలు ఇచ్చిన ఈ భూమిని స్థానికులు కౌలుకు తీసుకున్నారు. ఏటా రూ.6 వేలు కౌలు చెల్లిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా కౌలుకు తీసుకున్న వ్యక్తులు ఈ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పక్కనే ఉన్న తమ పొలంలోకి ఈ మట్టిని తీసుకెళుతున్నారు. మట్టి తవ్వకాలతో ఆలయ భూముల్లో భారీ గుంతలు ఏర్పడుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు యోగ్యమైన ఆలయ భూములను అక్రమార్కులు పనికి రాకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పనులు నిలిపివేయించాం: ఈఓ శ్రీనివాస్

ఆలయ భూముల్లో మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో రెండు రోజులు క్రితం రెవెన్యూ అధికారుల సహాయంతో పనులు నిలిపివేయించాం. ప్రత్యక్ష పరిశీలన చేసి సర్వే చేపడతాం. అక్రమమని తేలితే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌రాజ్

మణికొండ: రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్‌గౌడ్, మాజీ కార్యవర్గసభ్యుడు ప్రేమ్‌రాజ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మణికొండ యూనియన్ బ్యాంక్ కూడలిలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత తీవ్రంగా ఉందని, గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలు డబుల్ బెడ్‌రూం, నిరుద్యోగ భృతి, రైతులకు రూ. లక్ష రుణ మాఫీ, 24 గంటల ఉచిత విద్యుత్, లక్ష ఉద్యోగాలు నెరవేర్చకలేక పోయారన్నారు. దీంతో ప్రజలు బీజేపీకి అధికారం కట్టబెట్టే ఆలోచనతో ఉన్నారన్నారు. కేంద్రంతో పాటు 22 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రాల అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను ప్రకటించి తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో బలపడిన బీజేపీని చూసి బీఆర్ఎస్ నాయకుల్లో భయం పట్టుకుని అసత్యాలను ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకునే స్థితిలో లేరన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు వ్యతిరేకంగా బీజేపీ చేస్తున్న పోరాటానికి ప్రజలు సైతం 6359119119 నెంబర్‌కు మిస్‌కాల్ ఇచ్చి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ రూరల్ కన్వీనర్ మహాలింగంగౌడ్, నాయకులు జె. సిద్దప్ప, ఇందిర, వందన నగేష్, అనితాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, వేణుకుమార్, ఆనంద్‌రావు, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'చేజ్ టు విన్'



గోల్కొండ: విద్యార్థులకు చదువు, క్రీడలతో పాటు దేశభక్తిపై కూడా పాఠాలు బోధిస్తుండాలని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. ఆదివారం షేక్‌పేట్ వీనస్ హైస్కూల్‌లో జరిగిన చేజ్ టూ విన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు దశబ్దాలుగా విద్యా రంగంలో ఉంటూ ఎందరో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కల్పించిన వీనస్ విద్యా సంస్థల డైరెక్టర్ హిదాయత్ అలీఖాన్‌ను ఆయన అభినందించారు. మెహిదీపట్నం, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో విద్యనభ్యసించడమే కాకుండా శిక్షణ పొందిన సైనా నెహ్వాల్, పీవీ సింధూ, నికత్ జరీన్ లాంటి వారు భారతదేశ కీర్తి ప్రతిష్టతలను దేశవ్యాప్తం చేశారని ఆయన అన్నారు. మహ్మద్ హిదాయత్ అలీఖాన్ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో చదువుకున్న ఎందరో అమ్మాయిలు నేడు మల్టీ నేషనల్ కంపెనీలతో పాటు దేశీయంగా పేరున్న కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంటీఆర్, ఎస్ఎంకే అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్, ఐటానగర అధ్యక్షుడు మహమూద అలీ సోహెల్, డీలక్స్, బృందావన్ కాలనీ, ఫాతిమానగర్ కాలనీ అధ్యక్షుడు కె.ఖ్యూ, జునైద్, గయాసుద్దీన్, సయ్యద్ జియావుద్దీన్ తదితరులున్నారు.